నమస్తే తెలంగాణ

శేరిలింగంపల్లి | కూకట్‌పల్లి | కుత్బుల్లాపూర్

సోమవారం 23 జూన్ 2025

MONDAY, JUNE 23, 2025

III

## ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

కేపీహెచ్‌బీ కాలనీ : కూకట్‌పల్లి జోన్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని జడ్సీ అపూర్వచౌహాన్ కోరారు. నేడు ఉదయం 10 : 30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమస్యలపై ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిల్ కార్యాలయంలో నేడు ఉదయం 10 : 30 గంటలకు ప్రజావాణి యథావిధిగా ప్రారంభమవుతుందని, స్థానికులు సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి.. పరిష్కరించుకోవాలని జంట సర్కిళ్ల ఉప కమిషనర్లు గంగాధర్, వంశీకృష్ణ కోరారు.

### విద్యుత్ ఉండని ప్రాంతాలు

దుండిగల్ : విద్యుత్ తీగలకు అడ్డుగా పెరిగిన చెట్టుకొమ్మల తొలగింపు పనుల కారణంగా 33/11 కె.వి. నిజాంపేట్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజునాయక్ తెలిపారు. 11 కె.వి. వెంకట సాయి ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు,11 కె.వి. కేవీఆర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, నిజాంపేట పరిధిలోని జర్నలిస్ట్ కాలనీ, బండారి లేఅవుట్ ఏరియా, భీమరాజు వెంచర్, భవ్యాస్ ఆనందం, కేటీఆర్ కాలనీ, నిజాంపేట్ విలేజ్, కాపురెడ్డి లేఅవుట్, మధురానగర్ ప్రాంతాల్లో సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

# పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కుత్బుల్లాపూర్ : హ్యాట్రిక్ ఎమ్మెల్యే వివేకానంద్ చొరవతో సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.21,60,500 విలువ గల 56 సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయా డివిజన్లకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు ఆదివారం చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ డివిజన్ల లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, నియోజవర్గ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



ఎల్లమ్మ తల్లి కల్యాణ వేడుకల్లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

### వైభవంగా ఎల్లమ్మ కల్యాణం

132 – జీడిమెట్ల డివిజన్ వైష్ణవి ఎన్‌క్లేవ్ కాలనీలో రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారి కల్యాణం వైభవంగా జరిగింది. వేడుకలకు ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై పూజలు చేశారు. భక్తులను అనుగ్రహించే దైవం ఎల్లమ్మ అని, అమ్మ దయతో ప్రజలంతా సంతోషంగా జీవించాలన్నారు. వైష్ణవి ఎన్‌క్లేవ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగు వెంకటేశ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి రాకేశ్ కుమార్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు

### ఎమ్మెల్యే వివేకానంద్‌కు కృతజ్ఞతలు

జీడిమెట్ల : సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని శ్రీసాయివెంకట అవెన్యూస్ కాలనీలో సీసీ రోడ్డు వేయించినందుకు కాలనీవాసులు ఎమ్మెల్యే వివేకానంద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రోడ్లుసరిగా లేకపోవడంతో ఇబ్బందులు పడ్డామని, అధికారులకు పలుమార్లు తెలిపినా..ఫలితం లేకపోవడంతో ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లామని కాలనీ వాసులు తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే, అధికారులతో మాట్లాడి రోడ్డు వేయించడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం కాలనీ సభ్యులు.. శ్రీకాంత్ గౌడ్, దుర్గం సంతోష్, ఆకుల సంతోష్ ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటు చేసి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో అరవింద్, కిరణ్, కాలనీలోని కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

## మల్లికార్జునస్వామి వారి దర్శనం..



కేపీహెచ్‌బీ కాలనీ / దుండిగల్, జూన్ 22 : మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు , కూకట్‌పల్లి ఏమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదివారం శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకున్నారు. వారు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కొలుకుల జగన్, జూపల్లి సత్యనారాయణ, మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేశ్ రెడ్డి, బౌరంపేట్ పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, నాయకులు రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.



## సీతారాముల కల్యాణ వేడుకల్లో..



దుండిగల్ : రాజ్ బొల్లారంలోని శ్రీ సీతారామ స్వామివారి ఆలయ వార్షికోత్సవం నేపథ్యంలో ఆదివారం సీతారాముల కల్యాణం నిర్వహించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు, దుండిగల్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ పాల్గొని సీతారాములకు పూజలు చేశారు. మాజీ సర్పంచ్ మండల లక్ష్మీనారాయణ, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు మహేశ్, ఆలయ కమిటీ చైర్మన్ బాలగారి రాము, పీఏసీఎస్ డైరెక్టర్ అర్కల జీతయ్యా, నాయకులు సుదర్శన్, పిల్లి లక్ష్మీనారాయణ, రాజబాబు, వెంకటేశ్, మండల శ్రీనివాస్, ఆకుల అశోక్, రాజేశ్, కృష్ణ, రాములు, సాయిబాబా, ఆంజనేయులు, భిక్షపతి, రాజు పాల్గొన్నారు.



## ఆకట్టుకున్న కూచిపూడి ప్రదర్శన

కొండాపూర్, జూన్ 22 : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం నృత్యకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. దీక్షలయా గురువర్యులు లక్ష్మీశంకర్ శిష్య బృందం ప్రదర్శించిన నృత్యం అలరించింది. జగదానందకారకా, జతిస్వరం, గీత రసికే, మండూక శబ్దం, అప్సరసలు, నమశ్శివాయతే, వందే మీనాక్షి, రామాయణ శబ్దం, పరమ పురుషుడు, మంగళం అంశాలను ఆద్య, ఆశ్రిత, అమృత, అవంతిక, అవిజ్ఞా, గాయత్రి, వెంకట్, జీవిత, కార్తీక, నందిని, పూర్వీక, రితిక ప్రదర్శించిన తీరు ఆద్యంతం ఆకట్టుకున్నది.

## రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 22: కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో ఆదివారం కూరగాయల ధరలు (కేజీ–రూపాయలు). టమాట 21, వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 50, బజ్జి మిర్చి 23, కాకరకాయ 42, బీరకాయ 35, క్యాబేజి 18, ఫ్రెంచ్ బీన్స్ 85, క్యారెట్ 40, కాలీఫ్లవర్ 30, దొండ 23, చిక్కుడు 65, గోరుచిక్కుడు 35, బీట్‌రూట్ 25, క్యాప్సికం 65, ఆలుగడ్డ 25, కీరా 23, దోసకాయ 18, సొరకాయ 15, పొట్లకాయ 23, కందగడ్డ 35, ఉల్లిపోరక 45, ఉల్లిగడ్డ 24, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ 9 నుంచి 11, చామగడ్డ 30, ముల్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 30, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు(12) 24 నుంచి 30, మునగకాయ(1) 8 నుంచి 18, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు 40, ఎండుమిర్చి 160, అల్లం 80, వెల్లుల్లి 140, చింతపండు 160, కరివేపాకు 60గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

## ఆదరణ ఫౌండేషన్ సేవలు అభినందనీయం



ఉచిత వైద్య శిబిరంలో వైద్యశాల సీఈవో ఎన్.యోబు, లక్ష్మీ కమలాకర్, కల్పన


కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 22 : ఆదరణ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని సీఈవో ఎన్.యోబు, లక్ష్మీ కమలాకర్ అన్నారు. ఆదివారం రాందేవ్ రావు వైద్యశాలలో ఆదరణ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని వైద్యశాల మేనేజింగ్ డైరెక్టర్ కమలాకర్, లక్ష్మి, సీఈఓ యోబు, ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అరిగెల రఘునాథ్‌బాబు ప్రారంభించారు. చిన్న పిల్లలకు జనరల్ స్క్రీనింగ్, కంటి పరీక్షలు, ఇతర వ్యాధుల గుర్తింపు పరీక్షలు నిర్వహించామన్నారు. ముందస్తుగా పరీక్షలతో సకాలంలో చికిత్స పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో వైద్యశాల డాక్టర్లు మణికుమార్, ప్రశాంతి కల్పన, లీలా, సృజన ఫౌండేషన్ సభ్యులు భానువరకుమార్, మేరీ జోన్స్, అనీషా, సన్నీ ప్రశాంత్ పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం



కుత్బుల్లాపూర్, జూన్ 22 : రీచ్ సూపర్ స్పెషాలిటీ దవాఖాన బాచుపల్లి వారి ఆధ్వర్యంలో వెంకటేశ్వర నగర్ సత్ జ్ఞాన్ హైస్కూల్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. టీఎస్‌హెచ్, బీపీ చెకప్, ఆర్బ బీఎస్, వైద్యుల కన్సల్టేషన్ సేవలు అందించారు. వైద్యులు నవనీత, సాధారణ వైద్యుడు రామకృష్ణారెడ్డి, శస్త్ర వైద్యుడు చంద్ర కిరణ్, పిల్లల వైద్యుడు అక్షయ్, శ్వాసకోశ వైద్యుడు మహేశ్ , ఎముకల వైద్యులు, రీచ్ హాస్పిటల్ వైద్య సిబ్బంది పాల్గొని 300 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ లయన్ చింతల మల్లేశం, కాలనీవాసులు వాణిలత, విజయేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మున్నూరు కాపు (పటేల్స్)సంఘం ఉపాధ్యక్షుడిగా సతీశ్ నియామకం




దుండిగల్ : మున్నూరు కాపు (పటేల్స్) సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, బాచుపల్లికి చెందిన సీనియర్ బీఆర్ఎస్ నాయకులు చంద్రగిరి సతీశ్ నియమితులయ్యారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్ సతీశ్‌కు నియామక పత్రం అందజేశారు. చంద్రగిరి సతీశ్ మాట్లాడుతూ.. తనకి అవకాశం కల్పించిన దేవయ్య పటేల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్నూరు కాపు(పటేల్స్) ల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు హక్కుల సాధనకు పాటుపడతానన్నారు.



## నేరాల నియంత్రణకు.. సీసీ కెమెరాలు

అల్లాపూర్ : నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదపడతాయని, ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని అల్లాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి అన్నారు. శ్రీ వివేకానంద నగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన సీసీ కెమెరాలను కార్పొరేటర్ సబిహబేగం అల్లాపూర్ సీఐ వెంకటరెడ్డితో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో బొల్లు శ్రీనివాసరావు, చెవ్వూరు మధుసూదనచారి, తుంగం శ్రీనివాసరావు, రోణంకి జగన్నాథం, రామకృష్ణ, బండారు ప్రసన్నాంజనేయులు, ఈదరాడ సత్యనారాయణ, రవీందర్ రెడ్డి, సింహాషన్ముఖ రావు, సుందర శేషారావు, కొండం శ్రీనివాస్ రెడ్డి, నవులూరి రోశయ్య, సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## 26న 'సిరికాకొలను చిన్నది' నృత్య రూపకం

రవీంద్రభారతి : సినీ కవి వేటూరి సుందరరామమూర్తి రచించిన ' సిరికాకొలను చిన్నది' పాటలను నాట్యగురువు స్మితమాధవ్ నృత్యరూపక కల్పన చేసి రవీంద్రభారతి ప్రధాన వేదికపై 26 న సాయంత్రం నిర్వహించనున్నట్లు సాంస్కృతిక సంస్థ రాగ సప్త స్వరం నిర్వాహణలో భాషా సాంస్కృతిక సౌజన్యంతో జరిగే ఈ ప్రదర్శన గురించి సంస్థ కన్వీనర్ బీఎస్ రాజ్యలక్ష్మి తెలిపారు. వేటూరి సుందర రామమూర్తి రూపకంగా బాల రామాయణంలో సీతగా ఒకప్పుడు నటించిన స్మితామాధవ్ తన శిష్యబృందం కళాకారులతో తొలిసారిగా ప్రదర్శించటం అరుదైన ప్రయోగం అన్నారు. నాటి కార్యక్రమానికి అతిథులుగా మాలక్ష్మీగ్రూప్ అధినేత హరీశ్ యార్లగడ్డ, విద్యావేత్త ప్రీతిరెడ్డి, శాస్త్రవేత్త డా. జి.సతీష్‌రెడ్డి, సినీ కవి భారవి సంస్థ కన్వీనర్ వీఎస్ రాజ్యలక్ష్మి తెలిపారు.

## జలమండలి కార్యాలయాన్ని ముట్టడిస్తాం

జీడిమెట్ల, జూన్ 22 : సుభాష్ నగర్ డివిజన్, సూరారం కాలనీ, రాజీవ్ గృహకల్ప వాసులు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించకపోతే జలమండలి కార్యాలయాన్ని ముట్టడిస్తామని మేడ్చల్ జిల్లా ఫిషరీస్ డీఎఫ్సీఎస్ కమిటీ చైర్మన్ మన్నె రాజు అన్నారు. రాజీవ్ గృహకల్పలో కొన్ని నెలలుగా డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో ప్రజలు ఇబ్బంది పడుతూ పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు పట్టించుకోవడం లేదని తెలుసుకున్న మేడ్చల్ జిల్లా ఫిషరీస్ డీఎఫ్సీఎస్ కమిటీ చైర్మన్ మన్నె రాజు, సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ స్థానిక నాయకులతో కలిసి ఆదివారం పర్యటించారు. జలమండలి అధికారులు వ్యవహరిస్తున్న తీరు సరైనది కాదన్నారు. రాజీవ్ గృహకల్ప వాసులు ఇబ్బందులు, సమస్యలను పట్టించుకోకపోతే స్థానికులతో కలిసి కలిసి జలమండలి ఆఫీస్‌ను ముట్టడిస్తామని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో అధికారులు పని తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తారాసింగ్, బద్రి, కొత్తిమీర శీను, నరసింహ, రాణి, మధు, మల్లేశ్, సింహాచలం రమాదేవి, స్వరూప పాల్గొన్నారు.



సమస్యలను పరిశీలిస్తున్న మేడ్చల్ జిల్లా ఫిషరీస్ డీఎఫ్సీఎస్ కమిటీ చైర్మన్ మన్నె రాజు

## గృహిణి ఆత్మహత్య

కేపీహెచ్‌బీ కాలనీ : గృహిణి ఆత్మహత్య చేసుకున్న ఘటన కేపీహెచ్‌బీ కాలనీ పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఖమ్మం జిల్లా, కొనిజర్ల మండలం, సాలెబంజారాకు చెందిన మాలోత్ పూజిత (19)కు కేపీహెచ్‌బీ కాలనీలో నివసిస్తూ ఖజానా జ్యువెలర్స్‌లో సేల్స్‌మెన్‌గా పని చేస్తున్న జాటోత్ శ్రీనుతో వివాహమైంది. పెళ్లి తర్వాత వారు కేపీహెచ్‌బీ కాలనీలో నివాసం ఉండగా.. భర్త, అత్తమామలు అదనపు కట్నం వేధించగా.. మనస్తాపంతో శనివారం రాత్రి ఇంట్లో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. పూజిత తాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఆవిర్భావ దినోత్సవానికి సన్నాహం కావాలి

కుత్బుల్లాపూర్ , జూన్ 21 : ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి జూలై 7కు 31 ఏండ్లు కావస్తున్న నేపథ్యంలో ఎమ్మార్పీఎస్ సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి సంఘాన్ని బలోపేతం చేసేలా మాదిగలు ఐక్యమత్యంతో ముందుకు రావాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి తిప్పారపు లక్ష్మణ్ మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశం అంబేద్కర్ భవన్ లో జరిగింది. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ , ఎంఎస్పీ నూతన గ్రామ కమిటీల నిర్మాణం, 30 యేండ్ల ఉద్యమ ప్రస్థానం, సాధించిన విజయాలు, 31వ ఆవిర్భావ దినోత్సవంపై సుదీర్ఘంగా చర్చించారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కో – ఇన్‌చార్జి ఇస్రం రమేశ్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు సిల్వర్ శ్రీనివాస్ మాదిగ, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షుడు కేశపాక రామచందర్ మాదిగ, ఎమ్మెస్పీ జిల్లా ,సీనియర్ నాయకులు రాస మల్ల యాదగిరి మాదిగ, సలోమి మాదిగ, సంఘీ మహేశ్ మాదిగ, మట్ట నరసింహ, కురుమయ్య పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు లక్ష్మణ్ మాదిగ

## గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు

**శామీర్‌పేట** : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల జగద్గిరిగుట్ట( శామీర్ పేట)లో వచ్చే విద్యా సంవత్సరానికి ప్రవేశాలు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇశ్రత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23 వరకు ఉన్న గడువును 25వ తేదీ వరకు పొడిగించామన్నారు. కళాశాలలో బీఎస్సీ( బీజడ్‌సీ, ఎంజడ్సీ, ఎంఎస్‌డీఎస్, ఎంఎస్‌సీఎస్ హానర్స్, బీకాం, బీఎం కంప్యూటర్స్, బీఏ కోర్సులు ఉన్నాయన్నారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన షెడ్యూల్ క్యాస్ట్ అభ్యర్థులు ప్రవేశానికి అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు పదో తరగతి మార్కుల మెమో, ఇంటర్ మార్కులు మెమో, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, ఇంటర్ టీసీ, 8 పాస్ పోర్ట్ సైజు ఫోటోలతో కళాశాలకు వచ్చి 25వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని ఆమె కోరారు.

## మౌలిక వసతుల కల్పనకు చర్యలు



సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యేమర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతి పత్రం అందజేసిన కాలనీవాసులు

**అల్వాల్:** బస్తీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మచ్చ బొల్లారం డివిజన్‌లోని గంగా ఎవెన్యూ కౌకూర్ హరిజన బస్తీలో సీసీ రోడ్డు భూగర్భ డ్రైనేజీ పైపులైన్లు వేయించాలని, బర్షపేట్ కౌకూర్ నల్ల పోచమ్మ తల్లి ఆలయం వద్ద ముఖద్వార నిర్మాణానికి అనుమతులు ఇప్పించాలని,శ్మశాన వాటికలో వీధి దీపాలు ఏర్పాటు చేయించాలని ఎమ్మెల్యేను కలిసి ఆదివారం వారు వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే వెంట నే సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సందీప్ రెడ్డి, మహేష్, వినయ్, శివశంకర్, రాజేష్, వెంకటేష్, రాజకుమార్,పాల్గొన్నారు.

### ఆలయాల అభివృద్ధికి కృషి

**మల్కాజిగిరి:** ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం బోయిన్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఓల్డ్ నేరెడ్ మెట్‌లోని అల్లపోచమ్మ,రేణుకాఎల్లమ్మ ఆలయాల పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే సహాయం చేయాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ లక్ష్మణ్, శివకుమార్, శంకర్, సాయి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు

## కులగణనపై కేంద్రం స్పష్టత నివ్వాలి

కాచిగూడ, జూన్ 22: జనగణనలో కుల గణనపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత నివ్వాలని బీసీ మహాసభ జాతీయ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ అన్నారు. ఆదివారం నింబోలిఅడ్డాలో ఆయన మాట్లాడుతూ కులగణన అనేది బీసీల సామాజిక, ఆర్థిక,రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాల్లో ప్రాతినిధ్యం సాధించడానికి కీలకమైన అంశమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈనెల 16న విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ లో కులగణనకు సంబంధించిన స్పష్టమైన వివరణ లేకపోవడం బీసీలను తీవ్ర నిరాశకు గురిచేసిందని పేర్కొన్నారు. ఏప్రిల్ నెలలో జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో జనగణనలో కుల గణనను చేర్చాలని నిర్ణయించినప్పటికీ ఆ విషయాన్ని ప్రస్తావించకపోవడం బీసీల మనోభావాలకు విరుద్ధంగా ఉందన్నారు. ఈ అంశంపై కేంద్రం తక్షణమే స్పష్టత ఇవ్వాలని, బీసీల హక్కులను కాపాడేందుకు రాజ్యాంగబద్ధమైన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.